సాక్షి రంగారెడ్డి

సోమవారం । 6 । మే । 2024



సరదాగా వెళ్లి.. నీట మునిగి

చేపలు పట్టేందుకు వచ్చి చెరువులో ఇద్దరు బాలురు గల్లంతైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. 8లో▸



ప్రయోజనమేనంటా!

పంట పొలాల్లో వర్షం నీటిని నిల్వ చేసేందుకు ఫాం పాండ్స్‌ నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 8లో▸



మార్క్స్‌ ఆశయ సాధనకు కృషి

కారల్‌ మార్క్స్‌ ఆశయ సాధనకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్‌

బ్రాహ్మణ సామాజిక వర్గానికి పదవులివ్వండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్‌: కాంగ్రెస్‌ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు కార్పొరేషన్లలో చైర్మన్‌, డైరెక్టర్‌ పదవులు ఇవ్వాలని పార్టీ జిల్లా కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు గతంలో పార్టీ అధికారంలో లేనప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొని పార్టీలోనే నిస్వార్థంగా సేవ చేశారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి పదవులు ఇచ్చి న్యాయం చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో స్వరూప్‌రాజ్‌, సిరివోలు చక్రధర్‌ ఉన్నారు.

పోస్టల్‌ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

కలెక్టర్‌ శశాంక్‌



సరూర్‌నగర్‌లో పోస్టల్‌ బ్యాలెట్‌ సెంటర్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్‌

హుడాకాంప్లెక్స్‌: పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ శశాంక ప్రిసైడింగ్‌ అధికారులకు సూచించారు. పోస్టల్‌ బ్యాలెట్‌ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు సరూర్‌నగర్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్‌ ఫెసిలిటేషన్‌ సెంటర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్‌, ఓటర్‌ రిజిస్ట్రేషన్‌ రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు ఓటింగ్‌ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్‌ వెంట కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్‌, సరూర్‌నగర్‌ తహసీల్దార్‌, ఏఈఆర్‌ఓ వేణుగోపాల్‌ ఉన్నారు.

దేశంలో మోదీ ప్రభంజనం

- మరోసారి బీజేపీదే అధికారం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: దేశంలో మోదీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడ, ఖానాపూర్‌, తులేకలాన్‌ గ్రామాలకు చెందిన వివిధ పార్టీ నాయకులు ఆదివారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. తెలంగాణలో సైతం అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి సీటు ఎప్పుడు కదులుతుందోనని పరేషాన్‌లో పడ్డారన్నారు. భువనగిరి అభ్యర్థి డాక్టర్‌ బూర నర్సయ్యగౌడ్‌ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్త అశోక్‌గౌడ్‌, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, మర్పల్లి అంజయ్య, నారాయణ యాదవ్‌, మండల అధ్యక్షుడు దండె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

హ్యాపిల్‌

పులిమామిడిలో యాపిల్‌ సాగు

- ఒక్కో చెట్టుకు సుమారు 200 వరకు కాయలు
- ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి, కమల, సపోట, మామిడి, జాక్‌ ఫ్రూట్‌ సాగు సైతం
- మంచి దిగుబడి సాధిస్తున్న శ్రీనిఖిల్‌ చేతనా కేంద్రం ఆశ్రమ నిర్వాహకులు



ఆశ్రమ ఆవరణలో సాగు చేస్తున్న యాపిల్‌ తోట



విరగకాసిన యాపిల్‌ పండ్లు

కందుకూరు: యాపిల్‌ సాగు అనగానే హిమాచల్‌ప్రదేశ్‌, జమ్మూకశ్మీర్‌ గుర్తుకు వస్తాయి. కానీ మన రాష్ట్రంలోనూ అదీ మన జిల్లాలోనూ సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కందుకూరు మండలం, పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్‌ చేతనా కేంద్రం ఆశ్రమం నిర్వాహకులు. ప్రస్తుతం సాగు చేపట్టి మూడో ఏడాది అవుతోంది. ఒక్కో మొక్కకు దాదాపు వంద నుంచి రెండు వందల పండ్ల వరకు దిగుబడి సాధించారు. ఎండలను తట్టుకుని మరీ ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చిందని కేంద్రం నిర్వాహకుడు శార్దూల్‌ జోషి తెలిపారు.



యాపిల్‌ చెట్లను చూపుతున్న శార్దూల్‌జోషి

ముచ్చటగా మూడో ఏడాది..

2021 డిసెంబర్‌లో హరిమన్‌- 99 రకానికి చెందిన 170 మొక్కలను హిమాచల్‌ప్రదేశ్‌ నుంచి తెప్పించారు. నాలుగు అన్నా రకం మొక్కలు సైతం తీసుకొచ్చారు. ఇందుకోసం రవాణాతో కలిపి ఒక్కో మొక్కకు రూ.150 వరకు ఖర్చయింది. దాదాపు ముప్పావు ఎకరం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. రెండు అడుగుల లోతు, ఒకటిన్నర అడుగుల వెడల్పుతో గుంతలు తీయించారు. పశువుల ఎరువు, సూపర్‌ఫాస్పేట్‌ వేసి గుంతలు పూడ్చి మొక్కలు పొడవు, వెడల్పు 18/12 చొప్పున నాటారు. డ్రిప్పు ఏర్పాటు చేసి రోజు మార్చి రోజు రెండు గంటల చొప్పున నీటిని అందిస్తున్నారు. పచ్చదోమ, తెల్లదోమ, పురుగుల నివారణకు వేప నూనె 10వేల పీపీఎం 16 లీటర్లకు 25 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పంట కాలంలో 15 రోజులకు ఒకసారి, మిగతా సమయాల్లో 50 రోజులకు ఒకసారి పిచికారీ చేస్తున్నారు.

సాగు ఇలా..

డిసెంబర్‌ నెల మొదటి వారంలో మొక్క కొమ్మలను కత్తిరించి, ఆకుల మొత్తాన్ని తొలగించాలి. కొమ్మ కత్తిరించిన తర్వాత ఆకులు పూర్తిగా రాలడానికి ఇథనాల్‌ లీటర్‌కు 4 మి.లీ. కలిపి స్ప్రే చేస్తే మూడు రోజుల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. ఆ తర్వాత పది రోజుల్లో కొత్త చిగురు ప్రారంభమవుతుంది. 30- 40 రోజుల్లో పూత మొదలవుతుంది. కొమ్మ కత్తిరింపుల దగ్గర నుంచి ఆరు నెలల్లో పంట పూర్తవుతుంది. ఏప్రిల్‌ చివర లేదా మే నెల ప్రారంభంలో పంట కోత చేపడతారు. పంట కోత పూర్తయిన తర్వాత జూన్‌, జూలై నెలల్లో మరోసారి కొమ్మ కత్తిరింపు చేసి పశువుల పేడ వేస్తారు. కొమ్మ కత్తిరింపు చేపట్టిన రెండుసార్లు మొక్కకు సుమారు ఐదు కిలోల చొప్పున పశువుల పేడ, 200 గ్రాముల సూపర్‌ఫాస్పేట్‌ వేయాలి. కొమ్మ కత్తిరింపు సమయాల్లో మొక్కల మధ్య ట్రాక్టర్‌ లేదా ఎద్దులతో దున్నాలి. అవసరాన్ని బట్టి ఎం-45 మందు లీటరు నీటికి 2 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. కేవలం ఎర్ర నేలల్లో పంట సాగు చేపట్టాలి.

వేసవి వాతావరణంలోనూ..

ప్రస్తుతం ఎండలు 40 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. 40 డిగ్రీల్లోపు ఎండ ఉంటే పెద్దగా కాయలు దెబ్బ తినలేదు కానీ అంతకంటే ఎక్కువ ఉంటే దెబ్బ తింటున్నట్లు గుర్తించారు. ఈదురు గాలులు, ఎండలకు షేడ్‌ నెట్‌ ఏర్పాటు చేస్తే దిగుబడి మరింత పెరగనుంది. పంట దిగుబడిలో రెండో ఏడాది పరిమాణం తక్కువ వచ్చినా ఈ ఏడాది ఆశించిన మేర ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక్కో మొక్కకు తక్కువలో తక్కువ వంద నుంచి 200 వరకు పండ్లు కాసాయి. మొక్కలు నాటిన ఏడాది తప్ప మిగతా పెద్దగా ఖర్చు లేదంటున్నారు.

పలు పండ్ల రకాలు..

ఆశ్రమంలో అవసరాల మేర యాపిల్‌ సాగుతో పాటు ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి, కమల, సపోట, మామిడి, అరటి, కొబ్బరి, నేరేడు, జాక్‌ ఫ్రూట్‌, గులాబీ, కూరగాయల సాగు చేపడుతున్నారు.

పట్టుదలతో సాగు చేశాం



ఆదిలాబాద్‌ జిల్లాలో ఓ రైతు యాపిల్‌ సాగు చేసి విజయవంతమైనట్లు ప్రచార సాధనాల ద్వారా తెలుసుకున్నాను. మనం కూడా ఎందుకు ప్రయత్నించకూడదని పట్టుదలతో హిమాచల్‌ప్రదేశ్‌ నుంచి మొక్కలు తెప్పించి సాగు చేపట్టాం. మూడో ఏడాది పంట తీశాం. ఒక్కో మొక్కకు వంద నుంచి 200కుపైనే దిగుబడి వచ్చింది. ఈసారి షేడ్‌ నెట్‌ వేద్దామనుకుంటున్నాం. ఆశ్రమం అవసరాల కోసమే తప్ప మార్కెట్‌లో విక్రయించాలనే ఆలోచన లేదు.

– శార్దూల్‌జోషి, నిర్వాహకుడు

శ్రద్ధతో సంరక్షణ చేపట్టాలి



యాపిల్‌ సాగును పరిశోధనా స్థానాలతో పాటు అక్కడక్కడ ఒకరిద్దరు ప్రయోగాత్మకంగా సాగు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. యాపిల్‌ సాగు చేస్తే శ్రద్ధతో సంరక్షణ చేపట్టాలి. పంట దెబ్బతినకుండా పొలం చుట్టూ వేడి, చలి, ఈదురు గాలుల నుంచి రక్షణ కల్పించేలా సుబాబుల్‌, మల్‌బార్‌నీమ్‌, సరుగుడు, సిల్వర్‌ఓక్‌, టేకు, వంటి చెట్లను పెంచాలి. షేడ్‌ నెట్‌ వేసుకుని డ్రిప్‌ ఏర్పాటు చేసుకోవాలి.

– జి.శ్రీకృష్ణ, ఉద్యాన నిపుణుడు, కృషి విజ్ఞాన్‌ కేంద్రం



తుక్కుగూడలో నిర్వహించిన రోడ్‌షోలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డి, ఇతర నాయకులు

హస్తం.. కదనోత్సాహం

- తుక్కుగూడలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌ షో, కార్నర్‌ మీటింగ్‌
- పెద్ద ఎత్తున హాజరైన పార్టీ శ్రేణులు
- జోష్‌ నింపిన నేతల ప్రసంగాలు

మహేశ్వరం/తుక్కుగూడ: చేవెళ్ల కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి తుక్కుగూడలో రోడ్‌ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితోపాటు నాయకులు చేసిన ప్రసంగాలు భారీగా హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో ఫుల్‌జోష్‌ నింపాయి. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీదీ రాష్ట్రానికి ప్రాజెక్టులు ఇవ్వకుండా, గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగానికి ప్రమాదం ఉందన్నారు. ఆ పార్టీ 400 సీట్లు గెలిస్తే ఆ పార్టీ నేతలే రిజర్వేషన్లు రద్దు చేస్తామని వారి రాష్ట్రాల్లో అంటున్నారన్నారు. దేశంలో ఉన్న పేదల సొమ్మును అంబానీ, అదానీతో పాటు పెట్టుబడిదారులకు పంచిపెడుతున్నారన్నారు. నల్లధనాన్ని తీసి ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షల నగదు జమ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు 15 పైసలు కూడా వేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను నయవంచన చేశారన్నారు. చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రూ.5 వేల కోట్లు ఉన్నాయని చెప్పుకోవడమే తప్ప పేదలకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. కరోనా సమయంలో తాను నియోజకవర్గం మొత్తం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదుకున్నానన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేదలను ఆదుకోవడం దేవుడెరుగు, అపోలో ఆస్పత్రుల్లో కరోనా రోగుల నుంచి భారీగా డబ్బులు దండుకొని తన ఆస్తులను పెంచుకున్నారని ఆరోపించారు. తాను నిరంతరం ప్రజల కోసం పని చేస్తానని మరోసారి లోక్‌సభకు పంపాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కేఎల్లార్‌, నియోజకవర్గ ఇన్‌చార్జిలు నేరేళ్ల శారద, నిజాముద్దీన్‌, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, బోధ మాధవరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని నాగారం, అమీర్‌పేట్‌, కోళ్లపడకల్‌, మహేశ్వరం గ్రామాల్లో రంజిత్‌రెడ్డి ప్రచారం చేశారు.

వాహనదారుల ఇక్కట్లు

శ్రీశైలం జాతీయ రహదారి తుక్కుగూడ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌ షో నిర్వహించడంతో ట్రాఫిక్‌ పోలీసులు హైదరాబాద్‌ వెళ్లే వాహనాలను ఔటర్‌రింగ్‌ రోడ్డు బ్రిడ్జి కింద చెక్‌పోస్టు వేసి మళ్లించారు. ఔటర్‌ సర్వీస్‌ రోడ్డు నుంచి రావిర్యాల, ఆర్‌సీఐ, రావిర్యాల గేటు గుండా సర్దార్‌నగర్‌ వైపు పంపించారు. కందుకూరు, కల్వకుర్తి, శ్రీశైలం వెళ్లే వాహనాలకు రావిర్యాల గేటు, తుక్కుగూడ ఔటర్‌ రింగ్‌ రోడ్డు బ్రిడ్జి కింద నుంచి మహేశ్వరం గేటు ద్వారా పంపించారు. సీఎం రోడ్‌ షో, కార్నర్‌ మీటింగ్‌తో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రోడ్‌షోకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, జనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

దేశానికి బీజేపీ ప్రమాదకరం

- మతతత్వ పార్టీని ఓడించాలి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పదేళ్లుగా చేసిందేమీ లేదని, దేశానికి బీజేపీ చాలా ప్రమాదకరమని సీపీఎం పొలిట్‌ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతతత్వ బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మోదీ సినిమా చూపిస్తారన్నారు. నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్‌, వరంగల్‌ కోఆపరేటివ్‌ మిల్లు, పసుపు బోర్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పూర్తిగా అవినీతి మయమైందని ఆరోపించారు. లోపభూయిష్ట నిర్మాణం నిరుపయోగం కానుందని, దీని బాధ్యత పూర్తిగా బీఆర్‌ఎస్‌దేనన్నారు. దళితులను వంచన చేసి అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టాలని బీజేపీ యోచిస్తోందని దుయ్యబట్టారు. కృష్ణమాదిగను బుట్టలో వేసుకొని మాదిగలను మోసం చేయాలని చూస్తోందన్నారు. శ్రద్ధ ఉంటే వర్గీకరణ చేసి చూపించాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని ఆరోపించారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు రావాలన్నారు. పదేళ్లలో 254 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసిందని, దీనర్థం రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర కాదా అని నిలదీశారు. దేశంలో పెట్టుబడిదారులకు రూ.16లక్షల కోట్ల అప్పులు మాఫీ చేశారు కానీ రైతులకు రుణమాఫీ చేయడం లేదని రాఘవులు మండిపడ్డారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలని చూస్తోందని పేర్కొన్నారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ వస్తే ఉపాధి హామీని ఎత్తివేస్తుందన్నారు. పేద ప్రజల కోసం భవిష్యత్తులో కాంగ్రెస్‌పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. చట్టసభల్లో నిజమైన ప్రతిపక్ష శక్తి ఉండాలంటే భువనగిరి నుంచి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్‌, రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.జంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్‌, సామేలు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను ఆదరించండి

యాచారం: సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, మాల్‌, చింతపట్ల తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌తో ప్రజలకు ఏం ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకుడు సాయిబాబా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.జంగారెడ్డి, జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్‌, మాజీ కార్యదర్శి భూపాల్‌, జిల్లా కార్యవర్గ సభ్యుడు పగుడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లే విస్తుపోయేలా సీఎం తీరు

- రేవంత్‌రెడ్డి పాలన మరిచి పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



కౌకుంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న సబితారెడ్డితదితరులు

చేవెళ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే, పీసీసీ అధ్యక్షుడిగానే వ్యవహరిస్తున్నారని.. ముఖ్యమంత్రిలా పాలన చేయడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. మండలంలోని కౌకుంట్లలో ఆదివారం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం నయా పైసా కూడా రాష్ట్రానికి సాయం చేయలేదని అన్నారు. ఇక రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఏం చేప్పారో వినాలని ఆయన మాట్లాడిన స్పీచ్‌లను వినిపించారు. రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, రైతు బంధు, పెంచిన పింఛన్‌ ఇలా ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. మళ్లీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని లేనిపోని మాటలు చెబుతున్నారన్నారు. ఎక్కడికి వెళ్తే అక్కడ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడని.. దేవుళ్లే విస్తుపోయేలా ముఖ్యమంత్రి తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ చైర్మన్‌ పి.కృష్ణారెడ్డి, సబితారెడ్డి తనయుడు కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు యాదవ్‌, చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్‌, పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో జన్మదిన వేడుకలు

ఎన్నికల ప్రచారానికి వచ్చిన సబితారెడ్డి ప్రజలతో కలిసి ప్రచారంలోనే జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ రోడ్‌షోలను విజయవంతం చేయాలి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌, మహేశ్వరం నియోజకవర్గాల్లో జరిగే కేటీఆర్‌ రోడ్‌షోలను విజయవంతం చేయాలని సబితారెడ్డి పిలుపునిచ్చారు. సాయంత్రం 5 గంటలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లోని ఆర్టీఏ ఆఫీస్‌ దగ్గర, 6 గంటలకు రాజేంద్రనగర్‌ నియోజకవర్గం మైలార్‌ దేవులపల్లి గణేశ్‌ నగర్‌ చౌరస్తాలో, 7 గంటలకు మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌ పరిధిలో రోడ్‌షోలు ఉంటాయని తెలిపారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

మహబూబ్‌నగర్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్‌ /కేశంపేట: కాంగ్రెస్‌ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని మహబూబ్‌నగర్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని కడియాలకుంట తండా, బూర్గుల, మధురాపూర్‌, కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, సంగెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు బీమా, రైతు బంధు, పంటలకు బోనస్‌, తులం బంగారు హామీలను అమలు చేయకుండా ఏమొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్ల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ పాలనలో ప్రజా సంక్షేమం జరిగిందని, బీళ్లుగా మారిన పొలాలకు నీళ్లు అందాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా కరువు తాండవిస్తోందని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌, ఎంపీపీ ఎల్లగమోని రవీందర్‌యాదవ్‌, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఈట గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి

సరదాగా వెళ్లి.. నీట మునిగి

జల్‌పల్లి చెరువులో ఇద్దరి బాలుర గల్లంతు



గల్లంతైన బాలుర కోసం గాలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

పహాడీషరీఫ్: చేపలు పట్టేందుకు వచ్చి చెరువులో ఇద్దరు బాలురు గల్లంతైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ బార్కాస్, ఎర్రకుంట ప్రాంతాలకు చెందిన అబ్దుల్ వాహెద్(14), ఉస్మాన్ నహదీ(16), హఫీజ్, వసీం, అబుబకర్ నహదీ అనే ఐదుగురు స్నేహితులు సెలవులు కావడంతో ఆదివారం సరదాగా చేపలు పట్టేందుకు జల్‌పల్లి పెద్ద చెరువుకు వచ్చారు. వాదే ముస్తఫా బస్తీ వైపు ఉన్న చెరువు ఒడ్డున బండరాళ్లపై కూర్చొని కర్రలకు గాలం చేసి చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో వాహెద్ గుండుపై నుంచి చెరువులో పడిపోయాడు. పక్కనే ఉన్న నహదీ, హఫీజ్‌లు అతన్ని రక్షించేందుకు లోనికి దూకారు. చెరువు లోతుగా ఉండడంతో వాహెద్, నహదీలు నీట మునిగారు. ఈత వచ్చిన హఫీజ్ అతికష్టం మీద బయట పడ్డాడు. వెంటనే స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. స్థానిక ఈతగాళ్ల సహాయంతో ప్రయత్నించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో, ఫైర్ సిబ్బందిని రప్పించారు. సాయంత్రం 7 గంటల వరకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించినా వారి జాడ తెలియరాలేదు. సోమవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ విజయానికి సమష్టి కృషి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

చేవెళ్ల: రాష్ట్రంలో వచ్చినట్లుగా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఈ ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేయాలని పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత, సర్పంచ్ కవ్వగూడెం విజయలక్ష్మీనర్సింలులు తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం నగరంలోని రంజిత్ రెడ్డి నివాసం వద్ద చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీం భరత్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మోజార్టీతో గెలిపించి రేవంత్ రెడ్డికి చేవెళ్ల ఎంపీ సీటును కానుకగా అందించాలన్నారు. మీరంత కలిసికట్టుగా ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌చారి, అనంతరాములు, యాదిరెడ్డి, రాజు, పాండు, వెంకటేశ్, బుచ్చయ్య, వెంకటయ్య, నర్సింలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నర్సింగ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నయీమొద్దీన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కటిక నర్సింగ్(38) మాంసం దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, గ్రామంలో ప్లాటు కొనడంతో నర్సింగ్ అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన నర్సింగ్ ఈ నెల 2న ఇంట్లో గుళికల మందు తిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అదేరోజు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నర్సింగ్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధం



మంటలకు కాలిపోతున్న తాటిచెట్టు

యాచారం: మండలంలోని తమ్మలోనిగూడలో ఆదివారం సాయంత్రం తాటిచెట్టుపై పిడుగు పడింది. పలు గ్రామాల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. అదే సమయంలో తమ్మలోనిగూడ గ్రామంలో రైతు దెంది రాంరెడ్డి పొలంలో తాటిచెట్టుపై పిడుగు పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో సమీప పొలాల వద్ద ఉన్న రైతులు భయాందోళనకు గురై పరుగులు తీశారు.

నీటికుంట.. ప్రయోజనమేనంటా!

- ఫాంపాండ్స్‌తో పెరగనున్న భూగర్భ జలాలు
- నిర్మాణానికి ప్రభుత్వ ప్రోత్సాహకం



ఫాంపాండ్స్ కోసం చేపట్టిన పనులను పరిశీలిస్తున్న అధికారి

కేశంపేట: పంట పొలాల్లో వర్షం నీటిని నిల్వ చేసేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా నీటికుంట(ఫాం పాండ్స్)ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ పథకం కింద రైతు ఆసక్తిని బట్టి కూలీలతో ఫాం పాండ్స్‌ను నిర్మించుకుంటే ప్రభుత్వం డబ్బును సైతం అందిస్తుంది. ఈ మేరకు అన్నదాతలు నీటి కుంటల నిర్మాణానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అధికారులే వచ్చి..

ఫారం పాండ్స్‌ల నిర్మాణం కోసం రైతులు ఆసక్తిని చూపిస్తే ఈజీఎస్ అధికారులు క్షేత్రానికి వచ్చి అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తారు. రైతు పొలంలో పల్లపు ప్రదేశాన్ని ఎంచుకుంటే వర్షాలకు పడిన నీరంతా ఒకే వైపునకు వచ్చి నీటి కుంట నిండుతుంది. పొలంలో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి ఫారం పాండ్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. నీటి కుంటలను రైతుల పొలాలను బట్టి గతంలో ఐదు రకాలుగా ఉండగా ప్రస్తుతం మూడు రకాలుగా నిర్మించుకోవచ్చు. 8 మీటర్ల పొడవు, వెడల్పుతో రెండు మీటర్ల లోతు మేర మొదటి రకం నీటి కుంట. 12 మీటర్ల పొడవు, వెడల్పుతో రెండు మీటర్ల లోతు మేర రెండో రకం. 20 మీటర్ల పొడవు, వెడల్పుతో మూడు మీటర్ల లోతు మేర మూడో రకం అందుబాటులో ఉంది.

ఆర్థిక తోడ్పాటు

పంట చేనులో నీటి కుంటలను నిర్మించుకుంటే వర్షం నీరు నిలిచి ఉంటుంది. ఈ నీటిని రైతు పశువులకు తాగునీరు అందించడానికి ఉపయోగపడుతుంది. అవసరం అనుకుంటే పంటలకు కూడా నీటిని అందించవచ్చు. కొద్దిపాటిగా కూరగాయాలను కూడా సాగుచేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగవచ్చు. నీరు నిలిచి ఉండటంతో పరిసరాల్లో భూగర్భ జలాల పెరుగుదల అమోఘంగా ఉంటుంది.

రైతులు ముందుకు రావాలి



నీటి కుంటల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలి. రైతుకు జాబ్‌కార్డు ఉండి ఫాంపాండ్స్ నిర్మించుకోవాలని ఆసక్తి ఉంటే ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో సభలు నిర్వహిస్తాం. అందులో దరఖాస్తు చేసుకుంటే స్థలాన్ని పరిశీలించి మంజూరు చేస్తాం. ఉపాధి కూలీల ద్వారా ఫాంపాండ్స్‌ను నిర్మిస్తాం.

– అజీజ్, ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీఓ, కేశంపేట

ప్రభుత్వమే నిర్మిస్తుంది



రైతులు తమ వ్యవసాయ పొలాల్లో నీటి ఎద్దడి లేకుండా చేయాలంటే వర్షపు నీటిని సక్రమంగా వినియోగంలోకి తీసుకురావాలి. అందుకోసమే ఫాంపాండ్స్‌ను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే ప్రభుత్వమే నిర్మిస్తుంది. దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయి.

– మక్బూల్, రైతు, నిర్దవెల్లి, కేశంపేట

కాంగ్రెస్‌తోనే పాలమూరు అభివృద్ధి

పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కొత్తూరు మున్సిపాలిటీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుతం అన్ని రంగాల్లో వెనకబడటానికి ప్రధాన కారణం బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలేనని అన్నారు. ఇరు పార్టీలకు చెందిన ప్రస్తుత ఎంపీ అభ్యర్థులు ఏళ్ల తరబడి మంత్రులు, ఎంపీలుగా పదవులు చేపట్టిన జిల్లా సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికీ జిల్లాలో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధే దర్శనమిస్తుందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ పాలనలోనే కట్టిన తాగునీటి, సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ ఎందుకు కొత్తగా జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా నిర్మించలేదని ప్రశ్నించారు. తనను ఎంపీగా గెలిపిస్తే కచ్చితంగా జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇన్ముల్‌నర్వతో పాటు మున్సిపాలిటీకి చెందిన ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పట్టణంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, జనార్దన్‌చారి, జగన్, సురేందర్, శ్రీను, గోవర్ధన్‌గౌడ్, జమ్రుద్‌ఖాన్, శేఖర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేశ్‌ను ఆశీర్వదించండి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి మల్లేశ్

యాచారం: స్థానికుడు బడుగు, బలహీన వర్గాలకు చెందిన నేత, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భువనగిరి ఎంపీగా గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి కిషన్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థి మల్లేశ్‌తో కలిసి ఆయన యాచారంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా మల్లేశ్‌కు అవకాశం కల్పించారన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలు అతడిని ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5 నెలలకే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం అనేక హామీలిచ్చి ఇవాళ అమలు చేయలేక చేతులు ఎత్తేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే పరిశ్రమలన్నీ ఈ నియోజకవర్గంలో ఏర్పాటైనట్లు చెప్పారు. పదేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. అభివృద్ధి చేయాలంటే ఒక్క బీఆర్‌ఎస్‌కే సాధ్యమన్నారు. అనంతరం మల్లేశ్ మాట్లాడుతూ, భువనగిరి ఎంపీగా గెలిపిస్తే ప్రజాసేవ చేసుకుంటానన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అభివృద్ధికి చిరునామా బీఆర్‌ఎస్ అని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాషా, గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఎండకు.. కారు అద్దాలు పగిలి



జాజుగుట్ట వద్ద పగిలిన కారు అద్దాలు

చేవెళ్ల: వేసవి ఎండలు మండిపోతున్నాయి. వీటి తీవ్రతకు మండలంలో ఓ కారు అద్దాలు పగిలిపోయాయి. ఈ సంఘటన ఇబ్రహీంపల్లి అనుబంధ గ్రామమైన జాజుగుట్టలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అహ్మద్ తన కారును ఇంటి పక్కనే పార్కు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం ఎండ వేడికి కారు వెనక అద్దాలు పగిలిపోయాయి. అద్దం పగిలిన శబ్దం రావటంతో బయటకు వచ్చి చూసిన వారికి ఏమి జరిగిందో అర్థం కాలేదు. ఎవరూ లేరు అద్దాలు ఎలా పగిపోయాయని చూశారు. కాసేపటికి ఎండ వేడికి పగిలిపోయినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో భయాందోళనలో గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

డీఆర్‌డీఏ డైరెక్టర్ సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ డైరెక్టర్ సతీష్‌రెడ్డి

మీర్‌పేట: దేశంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యలో కూడా కొత్త కొత్త కోర్సులు వచ్చాయని డీఆర్‌డీఏ డైరెక్టర్, రక్షణ మంత్రి సలహాదారు జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. శనివారం రాత్రి మీర్‌పేట టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రక్షణ రంగంలో సమున్నత మార్పులు తీసుకురావడంతో ప్రపంచంలోని పెద్ద దేశాలతో సమానంగా నేడు భారతదేశం అన్ని రంగాల్లో పోటీపడుతోందని తెలిపారు. విద్యార్థులు చె డు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో బీటెక్ విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన సయ్యద్ జిలానీ

పహాడీషరీఫ్: 7వ యూత్ మెన్, ఉమెన్ తెలంగాణ స్టేట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలలో జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన సయ్యద్ జిలానీ(17) గోల్డ్ మెడల్ సాధించి ఆదర్శంగా నిలిచాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సౌత్ లాలాగూడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీలలో పాల్గొన్న జిలానీ 71–75 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించాడు. టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న జిలానీకి పాఠశాల స్థాయి నుంచే బాక్సింగ్‌పై ఉన్న మక్కువను గుర్తించి ప్రోత్సహించడంతో గోల్డ్ మెడల్ సాధించాడని అతని తండ్రి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



కృష్ణ మృతదేహం

మొయినాబాద్: వ్యవసాయ బోరు వద్ద మోటార్ ఆన్ చేయడానికి వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకమామిడి గ్రామానికి చెందిన కంచె కృష్ణ(40) తన కున్న కొద్దిపాటి పొలంతోపాటు అదే గ్రామానికి చెందిన గూడూరి విఠలయ్య పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో వరి పంట సాగుచేశాడు. ఆదివారం ఉదయం కొడుకు జశ్వంత్‌ను తీసుకుని వరిచేనుకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ వద్దకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కృష్ణకు కరెంట్ షాక్ తగిలింది. అతను కింద పడిపోగానే కొడుకు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి చూశారు. వెంటనే ఆయనని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్క్స్ ఆశయ సాధనకు కృషి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కారల్ మార్క్స్ ఆశయాలను నెరవేరిస్తేనే ఆయనకు నివాళులు అర్పించినట్లు అవుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కారల్ మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. దోపిడీ వ్యవస్థ నుంచి కార్మికులను కాపాడటానికి ఆయన మార్గదర్శనం చేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే కార్మికులకు అండగా ఉంటూ ఉద్యమిస్తున్నామని అన్నారు. కారల్ మార్క్స్, ఎంగిల్స్ రచనలు పెట్టుబడి కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచ గతిని మార్చివేశాయని అన్నారు. కారల్ మార్క్స్ తన జీవితంలో కడుపేదరికం అనుభవించి సమసమాజ స్థాపన కోసం తపన పడ్డారని అన్నారు. గొప్ప శాస్త్రీయ పరిశోధన అధ్యయం ఆధారంగా రూపుదిద్దుకున్న మార్క్సిజం అజేయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు వెంకటరమణ, సత్యం, కావలి రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



రాణా ఆవరణలో వాహనాలు

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసిన సంఘటన మండల పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల నర్వ గ్రామ శివారులోని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ వాహనాలను పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కానిస్టేబుల్ రవి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ కొమురయ్య, జేసీబీ డ్రైవర్ పవన్‌లతో పాటు వాహన యజమానులపైన కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగం ఆదివారం తెలిపారు.

పండ్ల దుకాణదారులపై దాడి

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పండ్ల దుకాణదారులపై దుండగులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. నాగార్జున సాగర్‌రహదారిపై సాగర్‌ఎన్‌క్లేవ్ వద్ద ఫుట్‌పాత్‌పై పండ్ల వ్యాపారులపై 20 మంది దుండగులు ఆదివారం సాయంత్రం దాడిచేశారు. దీంతో దుకాణదారులు దుండగులపై ఎదురు తిరిగారు. కత్తులతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపు దాడిచేసిన వారు పరారయ్యారు. కాగా అక్కడ ఉన్న పండ్లదుకాణానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా దుకాణాలు దహనమయ్యాయి. ఈ సంఘటన వనస్థలిపురం ప్రాంతంలో సంచలనం సృష్టించింది. సంఘటనా స్థలంలో సాదిక్‌అలీ, షఫీ, మహబూబ్‌పాషాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి ఒంటిపై రక్తపు గాయాలు ఉండడంతో వారిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.